# అసమర్థుడూ - సహృదయుడూ

పడ్లపట్ల దయానందం




ఆ మాట వినటంతోటే అతనికి ఇల్లూ వళ్ళూ బంగారంతో నిండిపోయినంత సంతోషం కలిగింది. బాధలన్నీ క్షణంలో విరగడైపోయి తేలిక పడటానికి ఈ మార్గమొకటి ఉన్నదన్నది ఈక్షణంలోనే తెలియడం...అతనికి మరొక కొత్త బాధని కల్గించింది కూడా.

చాలారోజుల్నుంచి తను అనవసరంగా బాధ పడుతున్నాడన్న మాట... ఈ చిన్న విషయం... అల్పవిషయం...క్షణం ఒక యుగంగా అతి భారంగా తోస్తూవస్తున్న గతంలోనే తెలిసి ఉంటే....తను తను అనుభవించిన వ్యథ, పడవలసి ఉండేదే కాదు. పోనీ ఎట్లానూ అనుభవించేశాడుగా! ఇహ ఇప్పుడైనా...

"ఈ నాసిరకం మిరపకాయలు వద్దన్నారు. తీసుకు దబ్బిచ్చెయ్. మరోచోట."

పానకంలో పుడకలా మధ్యలో అడ్డు తగిలిన వాపస్ బేరానికి విసుక్కుంటూ ఏమిటో గొణుక్కున్నాడతను.

"అవునుమరి మొదటి రకంవి అందరూ ఖాతాదారులే పట్టుకుపోయారు. ఆ దబ్బొచ్చేసరికి ఇహ రొఖ్ఖం బేరం చూడబోతే ఇలా వాపస్ అయిపోతున్నదయ్యో" ఇదేం కొత్తకాదతనికి...విసుక్కోవడం గొణుక్కోవడం అయిదు సంవత్సరాల నుండీ అలవాటయిపోయింది.

మరొకప్పుడైనట్లయితే ఇంకా కాస్త గొణుక్కునేవాడేమో. కాని ఇప్పుడు అంత మంచి మాట చెప్పిన ఆయనెవరో అక్కడే కొట్టుబయట అరుగుమీద కూర్చుని ఏవో ఫారాలు పూర్తి చేసుకుంటున్నాడు. వాపస్ తెచ్చిన వాళ్ళని త్వరగా పంపించెయ్యాలి. ఆయన్ని ఆ మహానుభావుణ్ణి.

అవును మరి నిజంగానే మహానుభావుడు. ఏదో రాసుకోడానికి కలం ఉందా అంటూ కాకతాళీయంగా వచ్చి అంత మంచి విషయం చెప్పాడంటే నిజంమరితనకిమట్టుకు ఆయన మహానుభావుడే. ఆయన్నే మరికొన్ని వివరాలడిగి తెలుసుకోవాలి.

"ఊహుఁ... నే ముందే చెప్పాగా, ఉన్న సరుకిదని. తీసుకెళ్ళేటప్పుడు తెలియదూ?"... విసురుగా పొట్లం లాక్కుని బుట్టలో గుమ్మరించుకుని డబ్బులు నిర్లక్ష్యంగా త్రాసు సిబ్బెలోకి విసిరి పారేశాడు. వాపస్ తెచ్చిన అమ్మాయి వెళ్ళిపోయింది. కాస్త మనసు తేలిక పడ్డట్టయి చిన్న బీడీ ఒకటి ముట్టించాడతను. సంవత్సరంక్రితం సిజర్ సిగరెట్లే కాల్చేవాడు. అయితే పరిస్థితుల్ని బట్టి మారిపోవద్దూ మరి. అసలు తనబోటిగాడికి వ్యాపారం లాయఖీ కాదని అనుకుంటూ ఉంటాడప్పుడప్పుడూ.

అదేవిటోగాని కోపట్లు జాగిడి ఖజాన్నేసుకుని పొడీలమ్మి లక్షాధికారులైపోయిన చాలామందిని తను ఎరుగును. తనేమో ప్రతివిషయంలోనూ నాయుడు దర్జా వెలగబెట్టిండే ఉండలేడాయె. అందుకేగా వ్యాపారం ప్రారంభించిన ఈ ఐదు సంవత్సరాల్లోనూ లాభం లేకపోగా పైపెచ్చు ఐదువేలు చేద్ది వదిలిపోయింది.

అందులోనూ తనకి మహాచెడ్డ మొహమాటం. ఫలానావాళ్లు అరువుబేరానికి పనిమనిషిని పంపిస్తే లేదని నిర్మొహమాటంగా ఎలా చెప్పగలడు?... అందరూ గౌరవనీయులైన మర్యాదస్తులాయె... తెల్లవారితే వాళ్ళముందు మసులుతూండాలి. "చూచావా...చూచావా కాస్త దానికే తేలిక బుద్ధి చూపెట్టుకున్నాడ"ని వాళ్ళనుకుంటూ ఉంటే తను ఎలా తలెత్తుకు తిరుగుతాడు?

కనీసం బాకీలడగాలన్నా తనకి చెడ్డ తలవంపులుగా ఉంటుంది. తీసుకెళ్ళిన వాళ్ళకి తెలియదూ. వాళ్ళేం మూర్ఖులు కనుకనా...పశువులు కనుకనా. నిలవేసి 'ఎప్పుడిస్తావ్' అని దండించి అడగడానికి. వాళ్ళకా మాత్రం తెలియనట్టు అడగి వాళ్ళని కించపరచడం, తను తేలికతనాన్ని బయట పెట్టుకోవడం అంటే సుతలామూ తనకి పడని విషయం.

అయితే ట్రాన్స్‌ఫర్ అయి కాపురాలు ఎత్తేసి శాశ్వత రూపం దాల్చిన బాకీలే బోలెడున్నా తను అడగక ఊడిపడని బాకీలు వాటికి నాలుగురెట్లున్నాయ్.

అటువంటివాళ్ళెదురు పడినప్పుడు పలకరించి చిన్న చిరునవ్వు నవ్వుతాడంతే. వాళ్లూ గ్రహించకపోరు..."ఇదిగో మళ్ళా కన్పిస్తా" నంటూ త్వరత్వరగా నడిచిపోతారు ఎక్కడో తగలబడిపోయే కొంపలార్పడానికా అన్నట్టు. ఇలా నాలుగైదుసార్లయిపోతే ఇహ ఆరోసారి తనకే సిగ్గేస్తుంది వాళ్ళముఖం కనబడేసరికి. పాపం సిగ్గుతో తల వొంచుకుని తెల్లబోతూ ఉంటారు ... వెధవది తనమూలకంగా. అందుకే వాళ్ళని చూస్తే జాలేసి తనే పక్కకి తప్పుకుంటాడు, ఇప్పటికైనా తెలిసి వచ్చి పట్టుకురాకపోరు లెమ్మనుకుని. కాని అలా తెలుసుకు పట్టుకొచ్చి ఇచ్చినవాళ్ళు ఒక్కరూ...

ఆలోచనలమధ్య బీడీ ఒకదమ్ము లాగి ముందుకొంగాడు ఆయన్ని "ఆ మంచి విషయాన్ని" గురించి వివరాలడగటానికి.

అంతలోనే మరొక చిన్న అమ్మాయి గౌను తొడుక్కున్న అమ్మాయి గలగలలాడుతూ కొట్టు దగ్గర కొచ్చింది. కొట్టు బయట అరుగుమీద కూర్చుని ఫారాలు పూర్తిచేసుకుంటున్న కొత్తాయన్ని చూచి కాస్త తటపటాయించి మెల్లగా కొట్టులోపలికెళ్ళింది. తర్వాత అతని చెవులదగ్గర తన చిట్టి పెదవుల్ని ముచ్చటగా ఆడించింది.

"మరేం...మా అక్కేం... స్నో బుడ్డి ఒకటిమ్మంది. మరేం ఇదివరకిచ్చిన రాజాస్నోవద్దంట, ఇదిగో ఇది కావాలంట." చిన్న చీటీముక్క చిట్టి చేతులతో అందించింది. అతని కనుబొమలమధ్య చిన్న ముడి పడ్డా హృదయంలో ఆనందతరంగాలు లేపక మానలేదు.

ఆ చిన్నమ్మాయి....అక్కయ్య...

అతని ముఖాన్ని పలుచటి సిగ్గుతెర ఆవరించింది. చిరునవ్వు పెదవుల్ని రవ్వంత విడగొట్టి సాగొట్టింది.

ఆ చీటీముక్కలో "పాండ్సు స్నో"-తో బాటు రాత్రికి ఫలానా చోటుకి తప్పక రమ్మన్న వర్తమానం కూడా జతపడి ఉంది.

పాపం ఉత్త అమాయకురాలు...అత్తవారింటికి వెళ్ళినా మనసంతా తనమీదేనట.

తనంటే ఎంత అపేక్షో? తనేమో ఆ అమ్మాయికి ఎంతో అందంగా కన్పిస్తాడుట. ఈ మాట గతంలో అనేకసార్లు స్వయంగా చెప్పింది. ఊళ్లోకి వస్తే తనని కలుసుకోందే ఒక్క క్షణం కూడా ఉండలేదు. వల్లమాలిన అపేక్ష ఉత్త అమాయకురాలు....కబురు పంపిన ఏ రాత్రయినా బద్ధగించి తను వెళ్ళకపోతే అభిసారికై ఆ అమ్మాయే నిర్భయంగా కొట్టుదగ్గిరికొచ్చేస్తుంది. అంతులేని అనురాగాన్ని వెళ్ళబోస్తుంది. పాపం తనమీద అంత అపేక్ష కనబరిచే ఆ అమ్మాయిని నిర్లక్ష్యంచేస్తే మనసునొచ్చుకోదూ. ఐనా ఏం మర్యాదగా ఉంటుంది. అందుకే తనక్కూడా ఆ అమ్మాయంటే అపేక్ష. అందానికి సైతం తక్కువేంలేదు.

గవ్వల్లాంటి కళ్ళూ, ముత్యాల్లాంటి పళ్ళూ, చిగురుటాకుల్లాంటి పెదవులూనూ. ఓహ్ మాంచి అందంగానే ఉంటుంది.

నలుగురూ అనుకుంటారు.... తనేమిటో ఆ అమ్మాయి మోజులో పడి అంతా అర్పుకుంటున్నట్టూను...తనని గురించి చెడ్డగా అనుకునే వాళ్ళ మాటలు అసలు లెక్కచెయ్యడులే తను.

స్నో బాటిల్స్ తనదగ్గర లేవు... రూపాయి తీసి ఆ పిల్లకిచ్చి ఎదర కొట్టు చూపించి పంపేసాడు. బీడీ ఆఖరుదమ్ము లాగి అవతల పారేసి బయట వ్రాసుకుంటున్న ఆయన్ని మధ్యలో అడ్డు తగులుతున్నందుకు క్షమించమన్న స్వరంలో మెల్లగా అడిగాడు.

"అయితే ఎకరానికి ఎంత యిస్తుందండీ గవర్నమెంటు. ఆ ఫారాలెక్కడ దొరుకుతాయ్?"

ఆయనేదో వ్రాతపనిలో వుండి పరాగ్గా సమాధానం చెప్పాడు. అదైనా "వ్రాసుకోడానికి పెన్ను ఇచ్చావ్ కనుక" అన్నట్టు చిరాగ్గా...విసుగ్గా కూడా ఉందా సమాధానం.

"ఊ...ఆ...ఆ...ఎకరానికి ముప్పైఅయిదు, జాయింట్ పట్టాదారు అనుమతికూడా కావాలి. ఎగ్రికల్చరల్ ఆఫీసుకెళ్ళి ప్యూనుచేతిలో ఓ బేడ డబ్బులు పారేస్తే ఫారాలిస్తాడు"—

అతను క్షణంలో తనకున్న ఎకరాలసంఖ్య పెట్టి దాన్ని గుణించేసి మొత్తం లెక్కకట్టేశాడు.

మొత్తం నూటపలభయ్యో. గుండెల్లోనుంచి బరువేదో తొలగిపోయినట్టు స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నాడు. తిరిగీ ఆలోచనల్లో పడ్డాడు.

తనేదో పైకి అలా గంభీరంగా కనపడుతున్నాన్న మాటే కానీ లోలోపలే పడుతున్న వ్యథ ఎవరికి అర్థమవుతుంది. పట్టుమని పాతిక సంవత్సరాలైనా నిండని తన భవిష్యత్తుని గురించి ఆలోచించుకుంటే ఏ ముంది? గుండె చెరువై పోతుంది. ఏం చేస్తాడు...ఏదో గుండెని బండరాయిలా చేసుకుని మొండిగా దిగమ్రింగడం తప్ప. అదైనా ఇంకెంతకాలం....కాలం ఏమైనా నిలుస్తుంది కనకనా?...పైపెచ్చు క్షణక్షణానికీ కృంగదీస్తూ మరీ మీదపడుతుంది. అత్యల్పమైన ఒక్క క్షణం ఎన్నో విషమ సమస్యల్ని మీదికి విదిల్చి మరీ పోతుంది తర్వాత మరొక క్షణం పర్యవసానాన్ని అనుభవింప జేయడానికి తయారుగా సిద్ధమౌతుంది. ఆఖరుకొక క్షణం కల్పతరువులా కనికరించి ఈ బాధలన్నిటినుండీ....సరే ఇవి తనకి ఎప్పుడూ ఉండే ఆలోచనలే..పోని గతం వదులుకున్నా వర్తమానం.

ఐదు సంవత్సరాల కుర్రవెధవా అదీను. ఉన్న నాలుగెకరాలూ చూడబోతే మూడువేలకి తనఖా లో ఉన్నదయ్యె. తనకి రావలసిన బాకీలు సైతం అంతవరకూ ఉన్నాయ్. కనీసం ఆ బాకీలు వసూలు కావాలన్నా కొట్టులో సరుకులేందే ఎలా? దివాళా తీసి కొట్టు మూసేసిన వాడికిక బాకీ ఎవడిస్తాడు? రెండుమాసాల్నుంచి ఒక్క రెండు వందలు పుడుతుందేమోనని...శతవిధాలేం ఖర్మ.. సహస్ర విధాల ప్రయత్నం చేస్తున్నా రాగి కాని సైతం పుట్టటం లేదాయె. అన్న టైముకి సర్దుబాటు చేయలేక పోయిన తనకి...హోల్ సేల్ వాళ్ళు సయితం దమ్మిడీ అరువు పెట్టరాయె.

పాపం ఈయనెవరో దేవుడిలా ప్రత్యక్షమై చల్లటి కబురు చెప్పాడు. ఈ నూటపల్లైయ్యో ఉంటే...ఎలాగోలా మొత్తం రెండువందలకి అన్ని సరుకులూ వేసుకొచ్చెయ్యవచ్చు. ఆ సరుకులతో అలాఅలా ఉందనిపిస్తూ...ఏదో విధంగా బాకీలు వసూలు చేసేసుకుని..ముందా తనఖా విడిపించేస్తే ఏదిపోయినా అదైనా స్థిరంగా మిగులుతుంది. జాయింట్ పట్టాదారుని సంతకం కూడా కావాలట మరి బాబాయి చూడబోతే తనకి విరోధాయె ఛఛ...గవర్నమెంటు ఎప్పుడూ ఇంతే...ప్రతీదానికీ సవాలక్ష చిక్కుషరతులు పెడుతూంటుంది. పోనీ పిన్నిలాగూ తనమాట కాదనదులే ఆవిడ ద్వారా పని పూర్తి చేయించుకోవచ్చు.

కొన్ని క్షణాల్లోనే అతనిన్ని ఆలోచనలూ చేసి మరొక చిన్న సందేహం కలిగి...నివృత్తికోసం ఆయన వంక చూచాడు. ఆయన పని పూర్తి చేసుకుని పెన్నుకి కాప్ తొడిగేస్తున్నాడు ఇహ యిచ్చేసేందుకు. అంత మంచిసంగతి చెప్పినాయన్ని అలా ఊరికినే విడిచిపెట్టేయడం అతనికి భావ్యంగా తోచలేదు.

"ఏంవండీ వెడుతున్నారా? ఆగండి...కాస్త కాఫీ తీసుకు వెడుదురుగాని తెప్పించుతాను... అవునుకాని మనం అప్లికేషన్ పెట్టిన ఎన్ని రోజులకి డబ్బిస్తారో?" ప్రశ్నార్థకంగా ఆయన ముఖంలోకి చూస్తూ అడిగాడతను.

ఈ మాట అడగడంతోనే ఆయనకి ముఖాన్న ఒక్క నెత్తురుచుక్కైనా లేకుండా పోయింది. ఆయన కళ్ళేమో అతి జాలిగా చూచాయ్ అతనివంక. మన తత్వశాస్త్రజ్ఞుడిలా క్షణంలో అతని తత్వం కనిపెట్టేశాడాయన. మొదట తనన్న మాట సాధారంగా చేసుకుని గాలిలో మేడలు చాలా కట్టేశాడని ఇట్టే గ్రహించుకున్నాడు. ఇక అట్టే అతనిముఖం చూడలేక తల అటు త్రిప్పుకుని పెన్ను యిచ్చేస్తూ—

"ఇంతకీ మీరనుకుంటున్నది.... ఊహూ.... రొక్కంగా ఇవ్వరు...ఎరువుల రూపంలో" మాట పూర్తిచేయకుండానే దాటి వెళ్ళిపోయాడాయన.

పాపం అతని గుండె హఠాత్తుగా ఆగిపోయినట్లయింది. జీవత్వానికి సూచనగా హృదయంలో మోగుతూండే తంత్రులేవో పుటుక్కున తెగిపోయినట్లయి నోరు తెరచి అచేతనంగా అలా చూస్తూ ఉండిపోయాడంతే.

ఏదెలా ఉన్నా ఒక్కవిషయం మాత్రం మనం ఊహించవచ్చు. ఇంకెంతోకాలం ఆ కొట్టు తెరవబడి ఉండదనిన్నీ తర్వాత అతని అమాయకత్వానికి సహృదయతకీ పరిహాసించేవాళ్ళు తప్ప సాయపడే వాళ్ళొక్కరూ ఉండరనిన్నీ. ★